ఉపాధి కూలీల ఆకలి కేకలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు గతేడాది జూన్‌లో బోగోలు మండలంలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు. గతేడాది కావలి నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఖరీఫ్ సాగు చేపట్టలేదు. దీంతో గత ప్రభుత్వం కూలీలు ఇబ్బందులు పడకుండా ఉపాధి పనులు కల్పించింది. బోగోలు మండలంలో 17 మంది ఫీల్డ్‌అసిస్టెంట్ల పర్యవేక్షణలో నిత్యం సుమారు 2,000 నుంచి 2,500 మంది వరకు కూలీలు పనులకు హాజరయ్యారు. ప్రస్తుతం నలుగురు ఫీల్డ్‌అసిస్టెంట్లు మాత్రమే పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి పనులపై కన్నేసిన టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి 13 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లతో బలవంతంగా రాజీనామా చేయించారు. తద్వారా ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న ఫీల్డ్ కుటుంబాలకు జీవనాధారం లేకుండా చేయడంతో పాటు ఉపాధి పనులకు అంతరాయం కల్పించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో పనికి వెళితేనే పూట గడిచే పేదలు అల్లాడిపోతున్నారు.

ఉపాధిపై తమ్ముళ్ల పెత్తనం

- ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్ల తొలగింపు
- తమ వారిని నియమించుకునేందుకు ప్రణాళికలు
- గ్రామాల్లో నిలిచిన ఉపాధి పనులు
- వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు

కావలి: తమ స్వప్రయోజనాల కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు ఉపాధి కూలీల పొట్టకొడుతున్నారు. ఉపాధి పనులపై పెత్తనం చెలాయించి తమ జేబులు నింపుకోవాలని చూస్తున్నారు. అందుకోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లను బెదిరించడంతో పాటు మండలాధికారుల ద్వారా ఒత్తిడి తెచ్చి తొలగిస్తున్నారు. తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో ఉపాధి పనులు జరగక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సాగక వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో పస్తులతో గడుపుతున్నారు.



సర్వాయపాలెంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కావలి నియోజకవర్గంలోని కావలి రూరల్, అల్లూరు, దగదర్తి, బోగోలు మండలాల్లో ఉపాధి జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు సుమారు 30వేలు ఉన్నాయి. ఏడాదిలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంతో పాటు పనిచేసిన వారికి రోజుకు రూ.300 వేతం అందించాలి. గ్రామాల్లో ఉపాధి పనుల కల్పనలో ఫీల్డ్‌అసిస్టెంట్ల పాత్ర కీలకం. మండలాధికారులు క్రియాశీలకంగా వ్యవహరించి ఫీల్డ్‌అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించడంతో పాటు కూలీలకు గిట్టుబాటు కూలీ అందేలా చూడాలి. అయితే అధికారులు ఆ దిశగా క్రియాశీలకంగా వ్యవహరించడం లేదు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సాగు జరగకపోవడంతో పనులు లేవు. అయినా ఉపాధి పనుల కల్పనపై అధికారులు దృష్టి సారించ లేదు. గ్రామాల్లో అవసరమైన చెరువులు, పంట కాలువలు, తదితర పనులను గుర్తించి పనులు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి పనులపై పెత్తనం సాగించి తమ జేబులు నింపుకోవాలని టీడీపీ నాయకులు చూస్తున్నారు. అందుకోసం తమకు అనుకూలమైన వారిని ఫీల్డ్‌అసిస్టెంట్లుగా నియమించుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. నియోజకవర్గంలో సుమారు 65 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉండగా, 45 మందిని నయానో..భయానో తొలగించారు. దీంతో ఉపాధి పనులకు అంతరాయం ఏర్పడింది.దీనికితోడు ఖరీఫ్ సాగు సైతం లేకపోవడం కూలీలు పస్తులతో గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

పేదల కడుపు కొట్టడం దుర్మార్గం

కూలీ పనులు చేసుకుని కుటుంబాలు పోషించుకునే వారిపై కనికరం చూపకుండా ఉపాధి పనులు నిలిపివేయించి వారి కడుపుకొట్టడం దుర్మార్గం. ఫీల్డ్‌అసిస్టెంట్లు చిరుద్యోగులు. కూలీలకు ఉపాధి పనులు కల్పించడంతో పాటు వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా చూసేవారిని తొలగించడం అన్యాయం. ఇప్పుడు పనులు చేయించే వారు లేక ఆగిపోవడంతో పేదలు అల్లాడిపోతున్నారు. పేదల విషయంలో అధికారంలో ఉన్న వారు మానవత్వం చూపాలి.

– మద్దిబోయిన వీరరఘుయాదవ్, బిట్రగుంట

క్లుప్తంగా

రక్తదాన శిబిరం



మర్రిపాడు: చుంచులూరులో శ్రీఇంద్రాక్షి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా కడప రిమ్స్ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్రామానికి చెందిన డాక్టర్ వనం రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కడప రిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మొత్తం 46 మంది రక్తదానం చేసినట్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఎస్‌ఎఫ్‌డీ సంస్థ చైర్మన్‌కు పురస్కారం



సీతారామపురం : స్థానిక సొసైటీ ఫర్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ డాక్టర్ కలివెల ఎలిషాకుమార్‌కు ఉత్తమసేవా పురస్కారం అందుకున్నారు. 2023–24 సంవత్సరంలో సామాజిక సేవా రంగంలో ఎలీషాకుమార్ అందించిన విశిష్ట సేవలను గుర్తించి స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్రం పురస్కారాన్ని ప్రకటించింది. విక్రమ సింహపురి వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత చేతుల మీదుగా పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ఎంఈఓకు సన్మానం



సంగం: మండల ఎంఈఓ జానకీరామ్‌ను ఆపస్ నేతలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడంపై అభినందనలు తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

చేజర్ల: మండల తహసీల్దార్ ఏవీ రమణారావును బీజేపీ మండలాధ్యక్షుడు గుండాల విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం మండలంలోని రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

మట్టి తరలింపు అడ్డగింత

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాడు నుంచి ఓ వ్యక్తి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. గతంలో ప్రభుత్వం పల్లిపాడులో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించగా కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. ఇళ్లు నిర్మించకుండా ఉన్న ప్రదేశం నుంచి ఓ వ్యక్తి జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ఇళ్ల మధ్యన పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడుతుండడంతో గ్రామస్తులు తహసీల్దార్‌కు సమాచారం అందజేశారు. స్పందించిన ఆయన వెంటనే రెవెన్యూ సిబ్బందిని అక్కడకు పంపి మట్టి తరలింపును నిలిపివేశారు. మరోసారి అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీపు వేలం

ఆత్మకూరు: ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలోని అనంతసాగరం సెక్టార్‌లో ఉన్న ఏపీ 26డీ4727 నంబర్ గల 1996 మోడల్ జీపును వేలం వేయనున్నట్లు సీడీపీఓ పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతసాగరంలోని కార్యాలయంలో ఉన్న జీపు వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 20 నుంచి 30వ తేదీలోగా రూ.300 స్టేట్ బ్యాంకు డీడీ, ఆధార్, బయోడేటా, పూర్తి అడ్రస్సు జెరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విధుల్లో చేరిన సీడీపీఓ

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా విధులు నిర్వహిస్తూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన పచ్చవ లావణ్య శుక్రవారం విధుల్లో చేరారు. ఆమె మే 16నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు సెలవులో ఉన్నారు. ఇప్పటి వరకు అనంతసాగరం ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తిరిగి విధుల్లో చేరిన లావణ్య పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. సమయపాలన పాటించి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సోమశిల: అనంతసాగరం 108 అంబులెన్స్ వాహన పైలెట్ నరసింహారెడ్డిని పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణాలను కాపాడిన నరసింహారెడ్డి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు.

వైభవంగా మాతమ్మ ఉత్సవాలు ప్రారంభం



పవిత్ర జల కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు



విరాళాన్ని అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్

మాతమ్మ తిరునాళ్లకు నగదు విరాళం

ఆత్మకూరు: పట్టణంలోని 12వ వార్డు అరుంధతీయవాడలో కొలువైన మాతమ్మ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడ్రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు మహిళలు శివాలయం నుంచి పవిత్ర జల కలశాలను తీసుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా మాతమ్మ ఆలయం వద్దకు చేరుకుని మాతమ్మ మూలవిరాట్టును అభిషేకించారు. అనంతరం మాతమ్మను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు అరుంధతీయవాడలో మాతమ్మ తిరునాళ్ల శుక్రవారం ప్రారంభమైంది. మూడ్రోజుల పాటు తిరునాళ్లను వైభవంగా నిర్వహించనున్నారు. తిరునాళ్ల నిర్వహణకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, డాక్టర్ వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఎండీ డాక్టర్ జే ప్రణీత్ రూ.10వేలు విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో తిరునాళ్ల కమిటీ సభ్యులు ప్రవీణ్, శ్రీహరి, ప్రసాద్, కిషోర్, రాంకీకు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, టీ అశోక్ పాల్గొన్నారు.

ఆర్డీఓకు సన్మానం



కావలి: కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్‌ను సక్షం ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడంపై అభినందనలు తెలిపారు. పట్టణంలోని దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించి ఆదుకోవాలని కోరారు. సక్షం రాష్ట్ర ఘటనా కార్యదర్శి కృష్ణమోహన్, జిల్లా అధ్యక్షుడు రంగయ్య, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, సభ్యులు జీ తిరుపతిస్వామి, మంగళగిరి వేణుగోపాలరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్,ప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా కులధ్రువీకరణ పత్రాలు



ఆత్మకూరు(అనుమసముద్రంపేట): కుల ధ్రువీకరణ పత్రాలను పారదర్శకంగా మంజూరు చేయాలని, ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీఓ మధులత సూచించారు. ఏఎస్‌పేట మండలం ఏఎస్‌పేట, శ్రీకొలను, హసనాపురం, తదితర గ్రామాల్లో కులధ్రువీకరణ పత్రాల మంజూరుపై ఆత్మకూరు ఆర్డీఓ మధులత తహసీల్దార్ డీ రామకృష్ణతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.

వైభవంగా ఇంద్రాక్షి అమ్మవారి తిరునాళ్ల

మర్రిపాడు: మండలంలోని చుంచులూరులో ఇంద్రాక్షి అమ్మవారి తిరునాళ్లను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఇంద్రాక్షి అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు, లక్ష్మీగణపతి హోమం, స్కంద హోమం, ఇంద్రాక్షి హోమాన్ని నిర్వహించారు. అనంతరం సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. మహిళలు సామూహికంగా పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

సీతాలమ్మకు పొంగళ్లు

దుత్తలూరు: దుత్తలూరులో సీతాలమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతాలమ్మను ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని గ్రామస్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

మందుబాబుల నిరసన

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద శుక్రవారం మందుబాబులు తమకు నాణ్యమైన మందు అందించలేదని సిబ్బందిని నిలదీస్తూ నిరసన చేపట్టారు. దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది బ్రాండెడ్ మద్యాన్ని బ్లాక్‌కు తరలిస్తూ చీప్‌లిక్కర్‌ను తమకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. క్యూలో నిల్చున్నా అమ్మకాలు చేయడం లేదని, చిల్లర సక్రమంగా ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తిసున్నారని ఆరోపిస్తూ వాదనకు దిగారు. దీంతో కొద్దిసేపు మద్యం దుకాణాలు మూసివేశారు.

బహుమతుల ప్రదానం

ఉదయగిరి: గండిపాళెం గురుకుల పాఠశాలలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మేనేజర్ శోభన్‌బాబు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సీతారామపురంలో నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది



కొండాపురంలో..



కలిగిరిలో ...

ఉదయగిరి: కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం అమానుషమని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన అన్నారు. డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గండిపాళెం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం నిరంతరం శ్రమించే వైద్యులకే రక్షణ లేకుండాపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివకుమారి, సిబ్బంది వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సీతారామపురం: డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక పీహెచ్‌సీ ఎదుట వైద్యాధికారిణి స్వప్నారెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్‌ఎస్ రియాజ్, హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక పీహెచ్‌సీ ఎదుట వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వైద్యురాలిపై హత్యాచారం అమానుషమని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కొండాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట వైద్యారోగ్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా వైద్యాధికారి నసీరుద్దీన్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని ఖండించారు.నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. సీహెచ్ ఓ చెంచురామయ్య, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



రియాజ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

దుత్తలూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత ఇటీవల మరణించిన నర్రవాడ ఎంపీటీసీ మాదాల రామచంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం శాఖల వారీగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మండలంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. తదుపరి జరిగే సమావేశంలోగా సమస్యలకు పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతామన్నారు. అనంతరం ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న నర్రవాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ షేక్ రియాజ్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సంధ్యాలక్ష్మి, వైస్‌ఎంపీపీ మీసాల రమాదేవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనుల్లో తమ్ముళ్ల చేతివాటం

- డ్రైనేజీల్లో పూడికతీతకు రూ.22.81 లక్షలు మంజూరు
- మున్సిపల్ డ్రైనేజీలను వదిలేసి ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత
- యంత్రాలతో మమ అనిపించి నిధుల స్వాహాకు యత్నం



ఇరిగేషన్ కాలువలో జేసీబీతో పూడికతీత చేపడుతున్న దృశ్యం

ఆత్మకూరు: డ్రైనేజీల్లో పూడికతీత పనుల్లో తమ్ముళ్లు చేతివాటం చూపుతున్నారు. మా ప్రభుత్వం..మా ఇష్టం అన్నట్లుగా మున్సిపల్ పరిధిలోని పూడికతో నిండిన కాలువలను వదిలేసి ఇరిగేషన్ కాలువల్లో పనులు చేపడుతున్నారు. యంత్రాలతో తూతూ మంత్రంగా పనులు చేపట్టి నిధులు స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారు. మున్సిపాలిటీలోని 23వ వార్డుల పరిధిలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులకు కూటమి ప్రభుత్వం రూ.22.81 లక్షలను మంజూరు చేసింది. దీంతో ఐదు రోజులుగా పూడికతీత పనులు జరుగుతున్నాయి. అయితే పనులు దక్కించుకున్న తమ్ముళ్లు మున్సిపల్ కాలువలను వదిలేసి ఇరిగేషన్ కాలువల్లో జేసీబీ యంత్రాలతో పనులు చేపడుతుండడం చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పూడికతో నిండిన మున్సిపల్ కాలువలను వదిలేసి ఇరిగేషన్ శాఖ ద్వారా చేపట్టాల్సి సాగునీటి కాలువల్లో యంత్రాలతో పనులు చేపట్టడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అలాగే సోమశిల రోడ్డు సెంటర్ నుంచి బీఎస్సార్ సెంటర్ వరకు డ్రైనేజీలపై శ్లాబులు, రాళ్లు పరిచి కొందరు వ్యాపారాలు సాగిస్తున్నారు. వాటిని తొలగించి పూడికతీత పనులు చేపడుతున్నారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ సొంతంగా కూలీలను ఏర్పాటు చేసుకుని పనులు చేయించాల్సి ఉండగా మున్సిపల్ కార్మికులతో చేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిధులను అధిక భాగం స్వాహా చేసేందుకు ఇలా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాను సంప్రదించగా పట్టణంలోని మురుగునీరు ఇరిగేషన్ కాలువల్లో కలుస్తున్నందున జేసీబీతో పూడికతీయిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కార్మికులు కాంట్రాక్టర్ వద్ద పనులు చేయడం లేదని పేర్కొన్నారు. ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లును సంప్రదించగా పట్టణ పరిధిలో జేసీబీతో పూడితీత పనులు చేపడుతున్న కాలువలు ఇరిగేషన్ శాఖకు చెందినవేనని పేర్కొనడం గమనార్హం.

తమ్ముళ్ల నడుమ పంచాయితీ

డ్రైనేజీల్లో పూడికతీత పనులను తొలుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో టీడీపీ పట్టణాధ్యక్షుడు, ఎంపీపీ, మరో యువ నాయకుడికి మున్సిపల్ అధికారులు అప్పగించారు. అనంతరం పలువురు టీడీపీ నాయకులు తమకు పనులు అప్పగించాలని డిమాండ్ చేయడంతో మంత్రి వద్దకు పంచాయితీ చేరింది. ఆయన సమక్షంలో ఆయా వార్డుల టీడీపీ నాయకులు, కౌన్సిలర్లకు పనులు అప్పగించాలని తమ్ముళ్ల మధ్య రాజీ కుదిరింది. దీంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



కావలి: విజయదుర్గ ఆస్థాన పీఠంలో వరలక్ష్మీవ్రత పూజలు ఆచరిస్తున్న భక్తులు



మర్రిపాడు: డీసీపల్లిలోని పంచముఖ శక్తి గణపతి ఆలయంలో..



వరికుంటపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



సంగంలో వరలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న భక్తులు



ఉదయగిరి: వింద్యాపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు

కావలి : శ్రావణమాస రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో జగజ్జననికి విశేష పూజలు, సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. కావలి పట్టణంలోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రూరల్ మండలం రాజువారిచింతలపాళెంలో ఉన్న విజయదుర్గ ఆస్థానపీఠంలో వీరబ్రహ్మయ్య స్వామి ఆధ్వర్యంలో సామూహిక లక్ష కుంకమార్చన, వరలక్ష్మీ వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కావలి పరిసర ప్రాంత మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు ఆచరించారు.ఎమ్మెల్యే దగుమాటి వెంకట కష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వేముల చెన్నకేశవులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: పట్టణంలోని బీసీ కాలనీలో సమీపంలో ఉన్న సంతానలక్ష్మి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

- వింజమూరులోని వింజేటమ్మ ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చిన అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి పల్లకిసేవ జరిపారు.

సంగం: మండలంలోని ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. అమ్మవారికి ప్రీతికరమైన శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా ఆలయాలు మహిళా భక్తులతో కిక్కిరిశాయి. సంగంలోని తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. దువ్వూరులోని గంగాపార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయం, వంగల్లులోని భీమేశ్వరాలయంలోని కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంగంలోని త్రివేణి సంగమం ఒడ్డున ఉన్న సంగమేశ్వరస్వామి ఆలయంలోని సామూహిక కుంకుమార్చన, వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రత పూజలు ఆచరించారు.

కొండాపురం : శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించి ముత్తైదువులకు వాయినాలు సమర్పించారు. సాయిపేట, కుంకువారిపాళెంలోని మహాలక్ష్మి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరికుంటపాడు: మండల ప్రజలు వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించారు. ముత్తైదువలను తమ ఇళ్లకు ఆహ్వానించి వాయనాలు సమర్పించారు. మండలంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

దుత్తలూరు: మండల ప్రజలు వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించారు. ముత్తైదువలను తమ ఇళ్లకు ఆహ్వానించి వాయనాలు సమర్పించారు. నర్రవాడలోని వెంగమాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూరు: శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయంలోని అన్నపూర్ణాదేవి ఆలయం, పంటవీధి రామాలయంలోని పార్వతీదేవి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు, సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వరలక్ష్మీవ్రత పూజలు ఆచరించారు.

మర్రిపాడు: డీసీపల్లిలోని పంచముఖ శక్తి గణపతి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పాశర్లపూడి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో సామూహికంగా మహిళా భక్తులు వరలక్ష్మీవ్రత పూజలు ఆచరించారు.